# కమిటీలు వర్ధిల్లాలి

## వసుంధర

అప్పుడే ప్యూన్ వచ్చి ఓ కాగితం నాకు అందించి వెళ్ళిపోయాడు. అది చదువుకున్నాను.

మళ్ళీ కొత్త కమిటీ ఏర్పడింది. అందులో నేను మెంబర్ని.

రాష్ట్రంలోని ఎక్కడెక్కడి పురాతన వస్తువుల్ని సేకరించడానికీ. తెలుగు సంస్కృతికి సంబంధించిన పురాతన వస్తువులు దేశంలో కానీ ప్రపంచంలో కానీ ఎక్కడెక్కడ ఉన్నదీ తెలుసుకొనడానికి మా ఆఫీసు ఏర్పడింది.

మా ఆఫీసులో నలుగురు సైంటిస్టులున్నారు. ఆరుగురు ఆర్కియాలజీ నిపుణులున్నారు. ఇరవైమంది చరిత్ర గ్రాడ్యుయేట్సున్నారు. ఒకచిన్న లేబరేటరీ ఉన్నది. ఎక్స్‌రే, ఫోటోగ్రఫీ, లైబ్రరీ విభాగాలు వేరే ఉన్నాయి. ఈ మూడు విభాగాలకూ కలిపి పన్నెండుగురు స్టాఫ్ ఉన్నారు. వీరుకాక ఒక అడ్మినిస్ట్రేటివ్ విభాగం ఉన్నది. అందులో మళ్ళీ సబ్ డివిజన్స్.... పర్చేజ్, అకౌంట్స్, స్టోర్స్.... వగైరా వగైరా.... వాళ్ళంతా కలిపి ఓ యాభైమంది ఉన్నారు.

ఇంతమందికీ పైన ఒక ఆఫీసరున్నాడు. ఆఫీసు పరిపాలనా నిర్వహణ యావత్తూ ఆయనదే బాధ్యత.

రాష్ట్ర ప్రభుత్వం మా గురించి వంద ఎకరాల స్థలాన్ని కేటాయించింది. మా సంస్థ చాలా పెద్దది కావాలని ప్రభుత్వం ఆశయం.

నేనొక సైంటిస్టును. ఫిజిక్స్‌లో డాక్టరేట్ చేశాను. తెలుగు సంస్కృతి అంటే నాకెంతో ఇష్టం. అందుగురించి ఉడతాభక్తిగా ఏదైనా చేయాలన్నది నా కోరిక. అందుకే రీసెర్చి లాబరేటరీలకు బదులు ఇందులో చేరాను.

ఉద్యోగంలో చేరినప్పట్నించీ నాకూ ఆ ఆఫీసరుకూ పడలేదు. ఆయన పేరు ప్రతాపరావు.

ప్రతాపరావుకు ఈ సంస్థ గురించి కొన్ని అభిప్రాయాలున్నాయి.

తను చాలా గొప్పవాడు. తన ప్రతిభ వృధాకాకూడదని ప్రభుత్వం ఈ సంస్థను నెలకొల్పింది. అనగా ఈ సంస్థ తనది.

తనకోసం పుట్టిన ఈ సంస్థలో తనకు సహకరించడం కోసం కొంత మంది ఉద్యోగులున్నారు. తనకు సహకరించడం వారి బాధ్యత. సలహాల నివ్వడాన్ని సహకరించడంగా ఆయన భావించడు.

నేనుద్యోగంలో చేరగానే చేసిన మొదటి తప్పు అదే.

తెలుగు సంస్కృతికి సంబంధించిన సంస్థ ఇది. ఏ సంస్కృతి అయినా కళలలో ముడివడి ఉంటుంది. వివిధ రంగాలకు చెందిన కళాకారులకు సంస్థలో స్థానం కల్పించాలని నేను అన్నాను. అది ప్రతాపరావుకు నేనిచ్చిన మొదటి సలహా.

అప్పుడు ప్రతాపరావు నన్ను ఏకాంతంలోకి పిలిచి కళాకారులంటే ఎవరో–వారిమనస్తత్వాలెలా ఉంటాయో. వారిలో ఎన్నెన్ని ప్రమాదాలుంటాయో వివరించి–"వాళ్ళను అపాయింట్ చేశామంటే మన అదుపులో ఉండరు. అప్పుడు సంస్థను నడపడం కష్టమవుతుంది–" అని చెప్పాడు.

నేను నిర్మొహమాటంగా ఆయన మాటలను ఖండించి–"సంస్థను సులభంగా నడపడానికి కావలసింది– అదుపులో ఉండే మనుషులు కాదు. అధికారి సమర్థత–" అన్నాను.


ఏమనుకున్నాడో ప్రతాపరావు ఆ వెనువెంటనే మారుమాటాడకుండా నా భుజం తట్టి నన్ను మెచ్చుకున్నాడు.

మర్నాడే ఆయనే ఓ కమిటీని వేశాడు, అందులో నలుగురు సభ్యులున్నారు. నేను లేను. సంస్థలోనికి కళాకారులను తీసుకోవాలా, కూడదా అన్న విషయంలో నిర్ణయం తీసుకొనడానికి ఆ కమిటీ ఏర్పడింది.

కమిటీ ఏర్పడినందుకు నాకెంతో సంతోషం కలిగింది. నేను ప్రతాపరావును కలుసుకుని ఆ విషయం చెప్పి– మీరు కమిటీలో నన్ను కూడా ఉంచవలసింది– అన్నాను.

ఆయన నవ్వి– "కమిటీ సభ్యులు నిష్పాక్షికంగా ఆలోచించ గలగాలి. కళాకారుల విషయంలో మీకూ, నాకూ కూడా కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. అందుకని కమిటీలో మనమిద్దరమూ కూడా ఉండ కూడాదనుకున్నాను–" అన్నాడు.

అదీ నిజమే ననిపించింది. నేను ఆత్రుతగా కమిటీ నిర్ణయంకోసం ఎదురు చూశాను. నెలరోజుల అనంతరం కమిటీ



ఒక నిర్ణయానికి వచ్చింది. వివిధ రంగాలకు చెందిన కళాకారులను సంస్థలోనికి తీసుకొనడానికి బదులు_సంస్థలోని వ్యక్తులేవివిధ రంగాలకుచెందిన ప్రముఖ కళాకారులను కలుసుకుని అవసరమైన సూచనలు, సలహాలు, సహకారం పొందుతారు.

దీన్ని నేను తీవ్రంగా నిరసిస్తూ-సంస్థలో కళాకారుల అవసరం ఎంత ఉన్నదో ప్రతాపరావుకు చెప్పాను.

"నేనేం చేసేది? అది కమిటీ అభిప్రాయం-" అన్నాడాయన.

అప్పుడు నేను కమిటికి ఒక వినతిపత్రం సమర్పించుకున్నాను. కమిటీనిర్ణయాలన్నీ అసమంజసంగా ఉన్నవనీ - వాటిని మార్చుకోవలసిందనీకోరుతూ_కారణాలు వివరించాను.

మర్నాడు నన్ను కమిటీ సభ్యుల్లోఒకడైన కొండమాచారి కలుసుకుని- "నువ్వు మమ్మల్ని చాలా ఇబ్బందిలో పెట్టేశావు_" అన్నాడు.

"ఏమయింది?" అన్నాను.

"ఈ రోజుల్లో అధికారులు కమిటీలు వేస్తే- కమిటీ సభ్యులకు స్వతంత్రం ఉంటుందనుకుంటున్నావా? అధికారి అనుకున్నది మాచేత చెప్పించడం కోసమే ఈ కమిటీ!" అన్నాడు కొండమాచారి.

"అదే నిజమైతే ఈపద్ధతి మార్చాలి-" అన్నాను ఆవేశంగా.

"మారదు. ఎందుకంటే అధికారంలోఉన్న ప్రతివాడికీ ఈ పద్ధతి చాలా అనుకూలంగా ఉంటున్నది-" అన్నాడు కొండమాచారి.

"ఇప్పుడు నన్నేం చేయమంటారు?" అన్నాను.

"నీ సహోద్యోగిగా - నన్ను కరుణించి- ఆ వినతి పత్రం వెనక్కు తీసేసుకో-" అన్నాడు కొండమాచారి.

ఆయన వయసులో నా కంటె పెద్దవాడు. ఆయనంటే నాకు గౌరవమున్నది. అయినా వినతిపత్రం మాత్రం వెనక్కు తీసుకోనని చెప్పాను.

ఒక వారంరోజుల తర్వాత కమిటీతన నిర్ణయాన్ని ప్రకటిస్తూ- "మనసంస్థలో ఏయేరంగాల ప్రముఖులుండాలో నిర్ణయించడానికి మరో కమిటీ ఏర్పడితేబాగుంటుంది-"అన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

ఆ కమిటీ చేసిన సూచనలలో ఈ చివరి సూచన ఒక్కటే అమలుజరుపబడింది. మరో కొత్త కమిటీ ఏర్పడింది. ఆ కమిటీకి కూడా ముందే ఒక వినతిపత్రం సమర్పించుకున్నాను.

సుమారు ఆరువారాల చర్చల అనంతరం ఆ కమిటీ నిర్ణయించినది; తెలుగు సంస్కృతికి సంబంధించిన ఎన్నో వస్తువులు, తాళపత్ర గ్రంథాలు దేశమంతటా విస్తృతమై ఉన్నవి. వాటిని తిరిగి సంపాదించడానికి చట్టానికి సంబంధమైన ఇబ్బందులెదురయ్యే అవకాశం ఉన్నది. అందువల్ల ప్రప్రథమంగా సంస్థకు ఒక న్యాయవాది అవసరం ఉన్నది.

ఈ నిర్ణయానికి నేను తెల్లబోయాను. ఆ తరువాత రెండు నెలల్లో ఒక న్యాయవాది చేరాడు. ఆయన చేరాక ప్రతాపరావుకు బలం బాగా పెరిగింది. కళాకారుల విషయంలో నేను సమర్పించుకున్న వినతిపత్రం అసమంజసమని ఆయన న్యాయవాది చేతనే బదులు ఇప్పించాడు.

నాకు అర్థమయింది. న్యాయవాదిని సంస్థలో చేర్చుకున్నది- సంస్థ గురించి కాదు! నాబోటివాళ్ళు ప్రతాపరావుకు అడ్డు రాకుండా ఉండాలని!!

అయితే నాలో యువకరక్తం ఇంకా చల్లారనందున నేను అప్పుడప్పుడు కొత్త సూచనలు ఇస్తూనే ఉన్నాను.

మా సంస్థ ఒక మ్యూజియం బిల్డింగ్‌ను కట్టాలని నేను ప్రతిపాదించాను.

సంస్థలోని ఉద్యోగులందరికీ సంస్థ చుట్టూ క్వార్టర్సు నిర్మించబడ్డాయి. అయినప్పటికీ సంస్థకు కాళీస్థలం బోలెడు ఉన్నది. సంస్థలో విలువైన పురాతన వస్తువులు చేరుతున్నవి. వాటికి సరియైన రక్షణ- మ్యూజియం నిర్మాణం ద్వారా కలుగుతుందని నేను అభిప్రాయపడ్డాను. మ్యూజియం నిర్మాణానికి పాతిక లక్షలవుతుంది.

అయితే ప్రతాపరావుకీ సూచన నచ్చలేదు. సంస్థకు రెండంతస్థుల కార్యాలయం ఉండనే ఉన్నది. అందులో ఒక విశాలమైన హాల్లో పురాతన వస్తువులన్నీ ఉంచబడుతున్నవి. పాతిక లక్షల ఖర్చుతో వేరే మ్యూజియం నిర్మించవలసిన అవసరమేమున్నది! ప్రభుత్వం సొమ్ము వృధాచేయడం ప్రతాపరావుకు నచ్చదు.

మ్యూజియం గురించి నేను ప్రతిపాదించడానికి ఒక ముఖ్య కారణం ఉన్నది. మా బడ్జెట్లో సుమారు ఇరవై లక్షలు మిగిలిపోతున్నవి. ఆ డబ్బునెలా సద్వినియోగం చేయాలా అని చర్చలు జరుగుతున్నవి.

ఆఖరుకు ప్రతాపరావు యధాప్రకారంగా ఓ కమిటీ వేశాడు. ఈసారి అందులో నేనూ ఓ మెంబర్ని!

ఇన్నాళ్ళకు నాకూ కమిటీ మెంబరయ్యే అవకాశం వచ్చింది. ఈసారి ఎలాగైనా సరే తీవ్రంగా పోరాడి నేననుకున్నది సాధించాలనుకున్నాను.

కమిటీకి ఛైర్మన్ కొండమాచారి. ఆయన కాక నలుగురు సభ్యులంఉన్నాం. వారిలో న్యాయవాది కూడా ఉన్నాడు.

"ప్రస్తుతం పురాతన వస్తువులకు గిరాకీ పెరుగుతున్నది. అందువల్ల సంస్థకు పటిష్టమైన రక్షణ కావాలి. సంస్థ చుట్టూ బలమైన గోడను నిర్మించాలి-" అన్నాడు న్యాయవాది.

సంస్థ భవనం గట్టిగానే ఉన్నది. దానికి సెక్యూరిటీ గార్డ్సు ఇరవై నాలుగు గంటలూ కాపలా కాస్తూనే ఉంటారు. రక్షణకోసం మళ్ళీ గోడను కట్టడం ఎందుకు?

ఈ విషయమై నేను తీవ్రాక్షేపణ తెలియజేశాను.

"మనకు ఉన్నది ఇరవై లక్షే ఫండ్సు. పదిహేను లక్షల్లో గోడ అయిపోతుంది-" అన్నాడు న్యాయవాది.

"మ్యూజియమ్ కడితే కలకాలం ఉంటుంది, భవనం కడితే -మరి దేనికైనా ఉపయోగపడుతుంది. ఈ ఏడాది బడ్జెట్లో డబ్బు చాలకపోతే -వచ్చే ఏడాది బడ్జెట్లోంచి కొంత తీసుకోవచ్చు-' అన్నాను నేను. ఒక గోడకోసం పదిహేను లక్షలంటే నా ప్రాణం ఉసూరుమంది.

సంస్థ కార్యాలయ భవనంలో ఎంతో కాళీ స్థలముండగా వేరే మ్యూజియం భవనం కట్టడాన్ని- ప్రభుత్వం అంగీకరించదు. ఆడిట్ అబ్జక్షన్సు వస్తాయి. గోడకైతే అబ్జక్షన్సు ఉండవు.

"అటువంటప్పుడు మొత్తం డబ్బు సరెండర్ చేసేస్తే సరిపోతుంది. ఒక గోడకోసం -అదీ అవసరం లేని గోడ కోసం- పదిహేను లక్షలు ఖర్చు చేయడం- చాలా దారుణం-" అన్నాను నేను.

"ఈ సంవత్సరం మనం ఇరవై లక్షలు సరెండర్ చేశామంటే ఆ మేరకు వచ్చే సంవత్సరంలో కూడా మనకు బడ్జెట్ కట్ అయిపోతుంది. సంస్థ ప్రగతికి అది మంచిది కాదు-" అన్నాడు న్యాయవాది.

కమిటీలో నా మాటకు విలువ లేకుండా పోయింది. మెజారిటీ పక్షం నిర్ణయం ప్రకారం -సంస్థ కార్యాలయ భవనం చుట్టూ గోడ నిర్మాణం ప్రారంభమైంది.


"ఎందుకీ వెధవ గోడ?" అన్నాను నేను ఉక్రోషంగా కొండమాచారితో ఒక రోజున.

"మ్యూజియం భవనానికి పాతిక లక్షలంటేఅందులో మిగిలేది ఎంతో ఉండదు. గోడకు పదిహేను లక్షలంటే అంతా మిగులే!" అంటూ కొండమాచారి నాకు అసలు రహస్యం చెప్పాడు.

అంటే ఇదంతా ప్రతాపరావు స్వలాభంకోసమన్న మాట!

నాలో ఆవేశం ఇంకా పెరిగిపోయి "ప్రతాపరావు అవినీతిని బయటపెట్టలేమా?" అన్నాను.

"ఎలా? ఆయన ఏంచేసినా కమిటీల







ఆదేశం ప్రకారం చేస్తున్నాడు. కమిటీలో ఉండేది ఆయన క్రింద ఉద్యోగులు— వాళ్ళాయన అన్నది కాదనలేరు. కమిటీ ఆయనకు రక్షకవచం—" అన్నాడు కొండమాచారి.

క్రింది ఉద్యోగులు— అంతా నాలాంటి వాళ్ళంటే బాగుండేది. కానీ కొండమాచారి లాంటి వాళ్ళే ఎక్కువ కావడం వల్ల— ప్రతాపరావుకు కమిటీలో రక్షకవచం అవుతున్నాయి.

ఇందుకు నేనేం చేయాలి?

అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

మా సంస్థ పరిపాలనా వ్యవహారాలు మెరుగుపర్చడానికి ఉన్న అవకాశాలు పరిశీలించడం కోసం విజయమూర్తి అనే అయ్యేయస్ ఆఫీసరు మా సంస్థకు వచ్చాడు. ప్రతాపరావు ఆయనకు సకల మర్యాదలూ చేశాడు.

విజయమూర్తి విడివిడిగా ఒక్కొక్కరినే కలుసుకునే అభిప్రాయ సేకరణ చేశాడు. ఆయన నా వద్దకు వచ్చినపుడు నేను అధికారులు అవినీతిని కొనసాగించడానికి కమిటీల నే విధంగా ఉపయోగించుకుంటున్నదీ చెప్పి— "ముందు మీరు ఈ కమిటీల పద్ధతిని రూపుమాపాలి—" అన్నాను.

అధికారులు కమిటీలను ఏయే విధంగా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నదో నేను చెప్పగా ఆయన నోట్ చేసుకుని— "చాలా బాగా చెప్పావు. ఐ ఎప్రిసియేట్ యువర్ అండర్‌స్టాండింగ్ అండ్ డీప్ కన్సర్న్—" అన్నాడు.

నేను చాలా సంతోషించాను. కమిటీల పద్ధతి కింక స్వస్తి జరిగిందే అనుకొన్నాను. విజయమూర్తిని కన్విన్స్ చేయగలిగినందుకు ఎంతో ఆనందించాను.

ఒక వారం రోజుల తర్వాత నన్ను కొండమాచారి కంగ్రాచ్యులేట్ చేస్తూ— "మొత్తంమీద అనుకున్నది సాధించావు—" అన్నాడు.

"ఏం జరిగింది?" అన్నాను ఆశ్చర్యంగా.

"విజయమూర్తికి నీ పాయింట్సు నచ్చాయి—" అన్నాడాయన.

"ఎలా తెలిసింది?"

"ఈ రోజే ఆయన్నించీ ఉత్తరం వచ్చింది. పరిపాలనా నిర్వహణకు కమిటీలను నియమించాలా, కూడదా అన్న విషయం తేల్చడానికి ఓ కమిటీని నియమించమని విజయమూర్తి ప్రతాపరావుకు రాశాడు—" అన్నాడు కొండమాచారి.

"మళ్ళీ కమిటీయా?" అన్నాను. అయితే నా పాయింట్స్‌ను విజయమూర్తి ఏం అర్థంచేసుకున్నట్లు? కానీ అంత కంటే పిడుగులాటి వార్త కొండమాచారి నాకు చెప్పాడు.

"వెంటనే ప్రతాపరావు నన్ను పిలిచి ఉత్తరం చూపించాడు. ఆ కమిటీకి నేను చెయిర్మన్ని!" అన్నారు.

కమిటీలను ఆపడం నావల్ల కాదని గ్రహించాను. ఆ తర్వాతనుంచి నేనూ కొండమాచారిలాగే మారిపోయి సుఖ జీవనం చేశాను. ✲